క్లుప్తంగా

కుట్టు శిక్షణ కేంద్రాల పరిశీలన



శిక్షణ పొందుతున్న మహిళలతో అధికారులు

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలో వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ నాల్డెడ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మహిళా స్వశక్తికరణ నైపుణ్య అభివృద్ధి కుట్టు శిక్షణ తరగతులు నియోజకవర్గంలో నడుస్తున్నాయి. జహీరాబాద్‌లో 90, పస్తాపూర్‌లో 60, న్యాల్‌కల్‌లో 60, హైడిగుమ్మల్‌లో 30 మంది చొప్పున 240 మందికి ఉచితంగా శిక్షణ పొందుతున్నారు. శిక్షణ కాలం పూర్తయిన తరువాత వీరికి ఉచితంగా కుట్టు మిషన్‌లు పంపిణీ చేస్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రొడక్టివ్ కౌన్సిల్ ఆఫీసర్ ప్రకాష్, కోఆర్డినేటర్ సత్యంలు శనివారం శిక్షణ కేంద్రాలను సందర్శించి మహిళలతో వారు మాట్లాడారు. వారి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, కోడైరెక్టర్ రామచందర్‌రెడ్డి ఉన్నారు.

బీజేపీ అధ్యక్షుల నియామకం



రాజశేఖర్‌గౌడ్



కురుమ దశరథ్

నారాయణఖేడ్: మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాల బీజేపీ నూతన అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడిగా రాజశేఖర్‌గౌడ్, మండల శాఖ అధ్యక్షుడిగా కురుమ దశరథ్, వై. అనిల్‌రెడ్డి (కల్హేర్), బి.శంకర్‌రావు పాటిల్ (సిర్గాపూర్), బాబ్యానాయక్ (నిజాంపేట), ఎన్. సచిన్‌స్వామి (కంగ్టి), ఎస్. రాజశేఖర్‌పాటిల్ (నాగల్‌గిద్ద), పి.చంద్రకళ (మనూరు), బి.శ్రావణ్ కుమార్ (పెద్దశంకరంపేట) నియమితులయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా గోకుల్ అశోక్ గౌడ్, రాజు, రాజ్‌కుమార్ శెరిగే, చిల్క హన్మాండ్లు, జన్వాడ మధు, రాజేష్ జైస్వాల్, ఈశ్వరప్ప, అనిల్ కుమార్ నియమితులయ్యారు.

ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే కేసులు

తహసీల్దార్ వెంకటస్వామి



అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తున్న జేసీబీ

పటాన్‌చెరు: అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అమీన్‌పూర్ తహసీల్దార్ వెంకటస్వామి అన్నారు. శనివారం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని సర్వేనంబర్ 455లో ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని జేసీబీతో కూల్చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు.

కాలిపోయిన బోరు స్టార్టర్



కొత్త స్టార్టర్‌ను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధిలో అంబేడ్కర్ భవనం వద్ద బోరు మోటారు స్టార్టర్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. దీంతో నీటి సమస్య తలెత్తగా బీఆర్‌ఎస్ నాయకులు బరూర్ దత్తాత్రి మున్సిపల్ కమిషనర్ ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన మున్సిపల్ అధికారులు శనివారం కొత్త స్టార్టర్‌ను ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు ఆర్థిక సహాయం



ఆర్థికసాయం అందజేస్తున్న నరేష్‌గౌడ్

జహీరాబాద్ టౌన్: మంచి మార్కులు సాధించిన పేద విద్యార్థులకు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్‌గౌడ్ సన్మానించి, ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని రంజోల్ ప్రభుత్వ పాఠశాలలో చదివిన వినాయక, ఎం.భవాని, ఫర్హీన్‌లు టెన్త్ పరీక్షల్లో 500 పైగా మార్కులు సాధించారు. ఈ మేరకు శనివారం ముగ్గురు టాపర్‌లను సన్మానించి ఒక్కొక్కరికి రూ. 5 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు వైజ్యనాథ్, రవీందర్‌రెడ్డి, బాబు, ఖలీల్,చంద్రన్న ,గుండా రెడ్డి పాల్గొన్నారు.

ఆదాయంపై దృష్టి.. వసతులపై నిర్లక్ష్యం



జోగిపేట బస్టాండ్‌లో నేలపై కూర్చున్న ప్రయాణికులు



కొత్తగా దుకాణ సముదాయం నిర్మాణం

జోగిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో అసౌకర్యాలు

- నెలకు రూ.1.90 లక్షల ఆదాయం
- ప్లాట్‌ఫాంలు పెంచాలంటున్న స్థానికులు

జోగిపేట(అందోల్): జోగిపేట ఆర్టీసీ బస్టాండ్‌లో సరైన వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపార సంస్థల నుంచి ఆదాయాన్ని పెంచుకోవడంపై చూపిస్తున్న ఆసక్తి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు న్నాయి. 1960లో నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌ను కూల్చివేసి 1999లో అప్పటి రవాణా శాఖా మంత్రి కేసీఆర్ కొత్త బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి బస్టాండ్‌కు ప్రారంభోత్సవం చేశారు. 25 సంవత్సరాల క్రితం అప్పటి అవసరాలకు అనుగుణంగా బస్టాండ్ నిర్మాణాన్ని చేపట్టారు. ఆ తర్వాత ప్రయాణికుల సంఖ్య మూడింతలైనా బస్టాండ్‌ను విస్తరించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఆదాయ వనరులను పెంచుకునేందుకు మాత్రం దృష్టి సారించింది. బస్టాండ్ నిర్మాణ సమయంలో ఒక్క డబ్బా కూడా ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం బస్టాండ్‌లోపలి భాగం, అవతలి భాగం కలిపి 40 వరకు దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు టెండర్లు నిర్వహించి ప్రతి నెలా లక్షల రూపాయలు పొందుతున్నారు. ఇటీవల బస్టాండ్‌లో నాలుగు దుకాణ సముదాయాలను నిర్మిస్తున్నారు.

ప్రయాణికులకు సౌకర్యాలేవీ?

అందోల్ నియోజకవర్గ కేంద్రం జోగిపేట ఆర్టీసీ బస్టాండ్ విస్తరణకు ప్రభుత్వాలు శ్రద్ధ చూపకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ప్రతి రోజు సంగారెడ్డి, హైదరాబాద్, నారాయణ్‌ఖేడ్, నాందేడ్, మద్నూర్, మెదక్, నిజామాబాద్, నిజాంసాగర్, సిద్దిపేట ప్రాంతాల వైపు వెళ్లేందుకు సంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, సిద్దిపేట, నారాయణఖేడ్ డిపోలకు చెందిన సుమారు 250 వరకు ఆర్టీసీ బస్సులు వచ్చి వెళ్తుంటాయి. వందలాది మంది ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు జోగిపేట బస్టాండ్‌కు వస్తుంటారు. కేవలం నాలుగు ప్లాట్‌ఫాంలే ఉండడం, ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరగడంతో బెంచీలు సరిపోక నేలపైనే కూర్చునే పరిస్థితి ఏర్పడింది. ప్లాట్‌ఫాంలను పెంచాలని స్థానికులు కోరుతున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు వందల సంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు బస్టాండ్‌కు వస్తుంటారు.

కంపుకొడుతున్న టాయిలెట్లు

బస్టాండ్‌లోని టాయిలెట్ల నిర్వహణ సరిగ్గా లేక కంపుకొడుతున్నాయి. బస్టాండ్ ఆవరణలో నిలబడితే భరించలేని దుర్వాసనతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వీటిని కూడా తొలగించి కొత్త టాయిలెట్ల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది. వివిధ ప్రాంతాల నుంచి మహిళా ప్రయాణికులు వస్తుంటారు. వారు అసౌకర్యాలకు గురవుతున్నారు.

రూ.కోటిన్నరతో ప్రతిపాదనలు

రూ.కోటిన్నరతో అదనంగా రెండు ప్లాట్‌ఫాం నిర్మాణం, కొత్తగా టాయిలెట్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వానికి ఇది వరకే ప్రతిపాదనలు పంపాం. ఈ విషయాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం బస్టాండ్ పరిధిలో 35కి పైగా దుకాణాలకు టెండర్లు నిర్వహించి అప్పగించాం. ప్రతి నెల ఆర్టీసీకి రూ.1.90 లక్షల ఆదాయం వస్తుంది. ప్రయాణీలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– ఉపేందర్, డిపోమేనేజర్, సంగారెడ్డి

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

ఏడీఏ రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

హత్నూర(సంగారెడ్డి): నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జోగిపేట ఏడీఏ రమాదేవి పేర్కొన్నారు. మండలంలోని కాసాల రైతు వేదికలో శనివారం ఎరువుల దుకాణాల డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ రానున్నందున ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు కచ్చితంగా బిల్లులు ఇవ్వడంతో పాటు రికార్డుల్లో పొందుపరచాలని ఆదేశించారు. రైతులకు ఏమాత్రం ఇబ్బందులు తలెత్తిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు, వ్యవసాయ విస్తరణ అధికారులు మహేందర్, రమేష్, మనీషా, డీలర్లు పాల్గొన్నారు.

పశుపోషణతో ఆర్థికంగా బలపడాలి



టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

రాయికోడ్(అందోల్): రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పశుపోషణ చేపట్టి ఆర్థికంగా బలపడాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ పాండియన్ అన్నారు. శనివారం మండలంలోని నాగన్‌పల్లి, పీపడ్‌పల్లి గ్రామాల్లోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశుపోషణలో ఆధునిక పద్ధతులు పాటించడంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఉచితంగా పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండలంలో ఆయా గ్రామాల్లో 181 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఇంకా 4,800 పశువులకు టీకాలు వేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఓఎస్ ఘని, సుఖేష్‌పాల్, గోపాలమిత్రలు శివకుమార్, బాబయ్య, పోషకులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



కంది కేంద్రం వద్ద ధాన్యం వాహనాలు

కంది(సంగారెడ్డి): కంది పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మండలంలోని ఇంద్రకరణ్, కందిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు కందిలో 56 మంది రైతుల నుంచి 4633బస్తాలు, ఇంద్రకరణ్‌లో 76మంది రైతుల నుంచి 73,222 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించినట్లు పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 15 రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా 10 రోజుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువస్తున్నారని సీఈఓ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. రైతులకు అవసరమైన గోనె సంచులను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ2,320, బి గ్రేడ్ క్వింటాలుకు రూ. 2300 ప్రభుత్వం చెల్లిస్తోంది. సన్నరకం వడ్లకు రూ. 2320లతో పాటు బోనస్ రూ. 500లు చెల్లిస్తున్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని తీసుకురావడం వల్ల ఏ గ్రేడ్ ధర పొందే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

అంగన్‌వాడీ ప్రైవేటీకరణను ఆపాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: అంగన్‌వాడీని ప్రైవేటీకరణ చేయడం ఆపి, అంగన్‌వాడీ టీచర్లను, ఆయాలను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో అంగన్‌వాడీ టీచర్ల సమావేశం నిర్వహించారు. ఈ నెల 20న జరిగే సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వదిలించుకునే ప్రయత్నం చేస్తుందని, ప్రైవేటీకరణ లో భాగంగా ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక కార్మిక వ్యతిరేక విధానాలను వేగంగా అమ లు చేస్తున్నదని ఆరోపించారు. 29 కార్మిక చట్టాల ను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా అమలును తీవ్రతరం చేసిందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లాయూనియన్ నాయకురాలు శశికళ, కల్పన, వజ్రమని, రేణుక, నాగలక్ష్మి, శోభరాణి, విజయలక్ష్మి, టీచర్లు పాల్గొన్నారు.



ఊరేగింపుగా బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

ఘనంగా రేణుక మాతకు బోనాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని పెద్దాపూర్‌లో రేణుకమాత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శనివారం విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా ఆలయంలో పసుపు కొట్నం నిర్వహించి, మహిళలు ఎల్లమ్మ తల్లికిబోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కళాకారులు భక్తులకు ఎల్లమ్మ జీవిత చరిత్రను ఒగ్గు కథారూపంలో వినిపించారు. బీఆర్‌ఎస్ నాయకుడు శివరాజ్ పాటిల్ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అభివృద్ధికి రూ.35వేల విరాళం అందజేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతగా ఆర్‌బీడీ జట్టు



కప్ అందుకుంటున్న కెప్టెన్ , జట్టు సభ్యులు

జహీరాబాద్ టౌన్: బసవ జయంతి సందర్భంగా వారం రోజుల పాటు హైదరాబాద్‌లో వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి 34 జట్లు తలపడ్డాయి. జహీరాబాద్‌కు చెందిన రాష్ట్రీయ బసదళ్ టీం ఫైనల్‌లో విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. విజేత జట్టుకు నిర్వాహకులు కప్ రూ. 55,555 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఈశ్వరప్ప, నాయకులు సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. జహీరాబాద్ జట్టు క్రికెట్ టోర్నీ విజేతగా నిలిచి కప్ సాధించినందుకు రాష్ట్రీయ బసవదళ్ నాయకులు అభినందనలు తెలిపారు.

డిజైర్ సొసైటీలో వేసవి శిబిరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జెనీఫర్, పట్నాయక్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని డిజైర్ సొసైటీలో వేసవి శిబిరం శనివారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యూఎస్ కౌన్సిల్ జనరల్ జెనీఫర్ లార్సన్, ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం బాధిత విద్యార్థులకు వేసవి శిబిరం మొదటి రోజును ప్రారంభించారు. మ్యాజిక్ షో, మ్యూజికల్ చైర్స్ ఫ్యాషన్‌షో తదితర పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలు కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, మహిళలు, డాక్టర్లు, సొసైటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని సీతారామపురం కాలనీలో రూ.2 కోట్ల 17 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన సీసీ రోడ్డు నిర్మాణంలో అంతర్గత డ్రైనేజీ మ్యాన్ హోల్స్‌ను మూసివేస్తూ.. రోడ్డు నిర్మాణం కొనసాగిస్తున్నారని ఆరోపించారు. దీంతో భవిష్యత్తులో డ్రైనేజీ సమస్య వస్తుందని, డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌ను ఓపెన్ చేసుకునేలా ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

ఇసుక టిప్పర్ సీజ్



పోలీస్‌స్టేషన్‌లో ఇసుక టిప్పర్

మునిపల్లి(అందోల్): ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసినట్లు బుదేరా ఎస్‌ఐ రాజేశ్‌నాయక్ తెలిపారు. శుక్రవారం కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వివిధ రకాల వాహనాలను తనిఖీ చేస్తుండగా బ్యాతోల్ నుంచి బీదర్‌కు టిప్పర్‌లో ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. టిప్పర్‌ను సీజ్ చేసి యజమాని ఎండీ, అసిఫ్ ఖాన్, డ్రైవర్ మేరాజ్ షాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కార్పొరేటర్ సింధురెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీ శ్రీకార్యసిద్ధి పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ ఆరోగ్యం కోసం నిత్యం గంట సమయాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, నాయకులు నర్సింహ, సాయిరెడ్డి, సుధాకర్‌లు పాల్గొన్నారు.

◆ బైక్ మెకానిక్, హౌస్ వైరింగ్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి రూరల్: జిల్లా అభివృద్ధి సమస్త సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పూర్తి చేసుకున్న పురుషులకు బైక్ మెకానిక్, హౌస్ వైరింగ్‌లో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జాబ్స్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కొమురయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకాలంలో రోజుకి రూ. 300 పారితోషికం, భోజన, వసతి కల్పించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గలవారు ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, స్టడీ సర్టిఫికెట్స్, నాలుగు పాస్ ఫొటోస్ తీసుకోని బైపాస్ రోడ్డులోని పాత డీఆర్‌డీఏ కార్యాలయంలో 6లోపు సమర్పించాలని తెలిపారు.

◆ ఐఎన్‌టీయూసీతోనే సమస్యల పరిష్కారం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కార్మికుల సమస్యల పరిష్కారం ఐఎన్‌టీయూసీతోనే సాధ్యమని భెల్ ఐఎన్‌టీయూసీ అనుబంధ సంస్థ బీఎన్‌టీయూసీ అధ్యక్షుడు రెహమాన్ తెలిపారు. శనివారం బెల్ టౌన్‌షిప్‌లోని యూనియన్ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ 78వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో నేడు ప్రభుత్వ రంగ సంస్థల పరిస్థితి ప్రమాదకరంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త చట్టాల వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. భెల్ యాజమాన్యం కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందిందని ఆరోపించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధానకార్యదర్శి స్వామి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ 7వరకు ఎర్లీబర్డ్ పొడిగింపు

జిన్నారం (పటాన్‌చెరు): ఎర్లీబర్డ్ పథకాన్ని ఈ నెల 7వ తేది వరకు పొడగిస్తున్నట్లు బొల్లారం కమిషనర్ మధుసూదన్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఎర్లీబర్డ్ పథకం ద్వారా వినియోగదారులకు 5 శాతం రాయితీ కల్పిస్తునందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారులకు సూచించారు.

◆ అక్రమార్కులపై చర్యలు తీసుకోండి

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 27 తెలంగాణ కాలనీలో జోరుగా అక్రమనిర్మాణాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళనకు దిగారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా అక్రమనిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. నిర్మాణాలపై గతంలోనూ ఫిర్యాదులు చేశామన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోకపోవడం వల్ల పునరావృతం అవుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ స్థలాల పరిక్షణకు అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

◆ అందుబాటులో వైద్య సేవలు



మునిపల్లి(అందోల్): ఆయా గ్రామాల ప్రజలకు ప్రభుత్వం వైద్య చికిత్సలు అందుబాటులోకి తీసుకొచ్చింది. శనివారం మండలంలోని కంకోల్‌లో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో రోగులకు వైద్య సేవలు డాక్టర్ రవి ప్రారంభించారు. బీపీ, షుగర్, జ్వరం, క్షయవ్యాధి, రక్త పరీక్షలు, గర్భిణీలకు రక్త పరీక్షలతో పాటు మందుల పంపిణీ చేశారు. ప్రసవం మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేయడం జరుగుతుందని, అత్యవసరమనుకుంటే సదాశివపేట, సంగారెడ్డి ఆస్పత్రుల్లో చేయనున్నట్లు తెలిపారు. సాధారణ రోగులకు ఉదయం 9 గంటల నుంచి సా.4 గంటల వరకు వైద్య సేవలు ఉంటాయన్నారు. గర్భిణీలకు ప్రత్యేకంగా సోమ, శనివారం రక్త పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. డాక్టర్ రాణి, ల్యాబ్ టెక్నిషియన్ స్వేత, స్టాఫ్ నర్సు నిర్మల ఉన్నారు.

◆ 87వ రోజుకు చేరిన నిరసనలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు 87వ రోజుకు చేరాయి. డంపింగ్‌యార్డ్ ఏర్పాటును విరమించేవరకు నిరసనలు కొనసాగిస్తామని జేఏసీ నాయకులు తెలిపారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

నారాయణఖేడ్: సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరయిన చెక్కును మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులకు శనివారం అందజేశారు. ఖేడ్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు, బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు సతీష్ దేశముఖ్ కూతురి ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.12 వేలు మంజూరయ్యాయి. సంబంధించిన చెక్కును మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి తన చేతుల మీదుగా అందజేశారు. మాజీ జెడ్పీటీసీ రవీందర్ నాయక్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నగేష్, నాయకులు విట్టల్ రావు, మశ్చేందర్ పాల్గొన్నారు.

◆ సమస్యలు పరిష్కరించండి

సంగారెడ్డి టౌన్ : డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజు అన్నారు. శనివారం మండలంలోని పసల్వాది గ్రామ పంచాయతీలోని డబుల్ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు రోజుల నుంచి తాగడానికి నీళ్లు రావడం లేదని, డ్రైనేజీ లీక్ అవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ ఏరియా కార్యదర్శి యాదగిరి , మండల కమిటీ సభ్యులు శ్రీనివాస్, నాయకులు రాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

◆ ఎత్తిపోతలను వినియోగంలోకి తేవాలి

నారాయణఖేడ్: మంజీరా నదిపై నిర్మించిన ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తేవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అతిమెల మాణిక్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉమ్మడి మనూరు మండలంలోని పుల్‌కుర్తి, శాపూర్, తోర్నాల్, కారాముంగి, బోరంచ, న్యాల్‌కల్ మండలం అమీరాబాద్‌లో ఎత్తిపోతలను నిర్మించారన్నారు. 25 ఏళ్ల కిందట వాటిని నిర్మించినా నేటికీ పొలాలకు సాగునీరు అందడం లేదని వాపోయారు. ఆయా ఎత్తిపోతలను పునరుద్ధరించి నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వమే తీసుకుని సాగునీటిని అందించాలన్నారు.